శిథిలావస్థలో అంగన్వాడీ భవనం...

భయాందోళనలో చిన్నారులు, తల్లిదండ్రులు...

విశాలాంధ్ర-దేవీపట్నం : పురాతనమైన శిదిలావస్థకు చేరి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. పిల్లలను అంగన్వాడీకి పంపించాలంటేనే తల్లిదండ్రులు అమ్మో అంటున్నా పరిస్థితి. మాతా శిశు సంక్షేమ శాఖ అధికారులు తరచూ ఇన్స్పెక్షన్ వచ్చినా నివేదకులు తప్ప ఏమి చేయలేని దుస్థితి. దేవీపట్నం మండలం డిఎస్ పాలెం గ్రామంలోని అంగన్వాడీ భవనం పాడుబడి ఎక్కడకి అక్కడ నీరుగారుతూ ఎప్పుడు ఏం జరుతుందో భయం భయం ఉన్న పరిస్థితి. వచ్చిన ప్రతి అధికారికి గ్రామస్తులు విన్నవిస్తున్న పట్టించుకోని పరిస్థితి. ప్రస్తుతం ప్రీ స్కూల్ కింద పిల్లలకు అన్నీ ఆటా పాటా అంగన్వాడీ లోనే నేర్పిస్తుండగా పిల్లలను అంగన్వాడీకి పంపించటానికి తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. సుమారు పది పదిహేను సంవత్సరాలగా ఇదే దుస్థితి అని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోలార్ వెలుగులు నింపిన సమరిటన ఫర్ ద నేషన్

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు ఏజెన్సీ పరిధిలో ఉన్న రెండు గ్రామాలైన తడిక వాగు, మల్లవరంలో ఉండే కుటుంబాలు ఎప్పటినుంచో విద్యుత్ సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లు ఈ విషయాన్ని చింతూరు ఐటిడిఏ పిఓ దృష్టికి తీసుకువెళ్లడంతో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఎన్జీవో సంస్థ అయిన సమారిటన ఫర్ది నేషన్ దృష్టికి తీసుకు వెళ్లారు. పీ వో సూచన మేరకు ఆ సంస్థ ఈ రెండు గ్రామాల్లో ఏడు సోలార్ విద్యుత్ దీపాలు 75వేల వ్యయంతో అమర్చారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంస్థ అధినేత రామ్ కుమార్, టీం సభ్యులు మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థి అదృశ్యం...

కేసు నమోదు చేసిన పోలీసులు

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహ పాఠశాల -2 లో 10వ తరగతి చదువుచున్న జి మాడుగుల మండలం, పాలమామిడి పంచాయతీ, సీకుం బంధ గ్రామానికి చెందిన కించే భీమరాజు గత నెల 24న అనారోగ్యం కారణంగా పాఠశాల ఉపాధ్యాయుడి నుండి సెలవు తీసుకుని ఇంటికి వెళ్లాడు. కోలుకున్న తరువాత ఈ నెల 10న తానొక్కడే ఇంటినుండి బయలుదేరి పాఠశాలకు వెళ్తానని చెప్పి తన తండ్రి కించె సీతన్న వద్ద రూ.500/- నగదు తీసుకుని బయలుదేరినట్లు కాని పాఠశాలకు వెళ్ళకుండా గర్లిగెడ్డ గ్రామంలో ఉన్న తన అత్తయ్య అయిన సీతమ్మ ఇంటికి వెళ్ళినట్లు, తదుపరి రోజు సదరు భీమరాజు చింతపల్లి పాత బస్టాండ్ వద్ద తన మేనమామ అయిన గెమ్మెలి నీలకంఠం కి కనిపించి పాఠశాలకు వెళ్తున్నట్లు చెప్పినప్పటికీ పాఠశాలకు రాలేదని ఎక్కడికో వెళ్లినట్లు సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థి తండ్రి కి తెలియపర్చగా అతని కోసం వెతుకుతున్నప్పటికీ కనిపించని కారణంగా నేడు (16న) న అతని తండ్రి అయిన కించె సీతన్న చింతపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఈ విషయం పై చింతపల్లి పోలీస్ స్టేషన్ లో విద్యార్థి అదృశ్యం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మృతుని కుటుంబానికి రూ.15 వేలు సాయం

విశాలాంధ్ర-కూనవరం : ఇటీవల మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకటరామరావు కరెంట్ షాక్కి గురై మృతిచెందిన విషయం విదితమే. మానవతా దృక్పధంతో స్పందించిన స్థానిక వైసీపీ నాయకులు ఆ కుటుంబానికి 15 వేల రూపాయలు ఆర్థిక సాయమందించారు. ప్రభుత్వం సహృదయంతో స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు ఆవుల మరియదాసు దీకొండ గంగాధర్, కొమ్మని మోహన్ రావు, చిలకం హరినాద్ బాబు, కొమ్మని సునీత, పరిటాల పద్మావత, కట్టెబోయిన వెంకటేశ్వరరావు,దాసరి నాగరాజు, అపక వెంకట రామారావు, కంటే ప్రతాప్, కొమ్మాని వీర్రాజు, చిలకం లక్ష్మణరావు, మున్నాఫ్ గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి, చూచెరేవుల గూడెం గ్రామానికి చెందిన నోముల సత్యనారాయణ టెంట్ హౌస్, అందజేశారు.

పర్యాటక పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించు కొని 2023-24 సంవత్సరానికి వివిధ విభాగాల్లో పురస్కారాలకు అర్హులైన పర్యాటక రంగ వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి జి.దాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 పురస్కారాలకు దరఖా స్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఏపీ టూరిజం వెబ్సైట్ www.aptourism.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడ్ చేసుకోవాలని, పూర్తిచేసిన వాటిని ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆటోనగర్, విజయ వాడకు ఈ నెల 22లోగా పోస్ట్ ద్వారా గాని వ్యక్తిగతంగా గాని అందజేయాలని కోరారు.

ముఖ్యమంత్రి జివో నెంబర్-3పై ఇచ్చిన హామీ అమలుచేయాలి

- 18న జరిగే ఏపీ కేబినెట్ సమావేశంలో ఆర్డినెన్స్ తీసుకురావాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పాడేరు : ఈ నెల18 తేదిన జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జివో నెంబర్-3పై చట్ట బద్దతపై ఆర్డినెన్సు తీసుకురావాలని ఆదివాసి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ,జిల్లా నాయకులు పాలికి లక్కు పాడేరులో జరిగిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ జీవో నెంబర్-3 పై ఆదివాసీ దినోత్సవం రోజున రాష్ట్ర ముఖ్య మంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని అందుకే మాట్లాడలేకపోతున్నానని ఎన్నికల కోడ్ అనంతరం స్పష్టమైన ప్రకటన చేస్తానని అన్నారని తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని,ఎన్నికల్లో ముఖ్యమంత్రి జివో నంబర్-3 చట్ట బద్ధపై ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు కేబినెట్ అర్డినెన్స్ తీసుకురావాలన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 4 నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం జివో నెంబర్-3పై, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ఏటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.ప్రభుత్వం గిరిజన సలహా మండలి తక్షణమే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఆదివాసి స్పెషల్ డిఎస్సి కోసం ఆదివాసి యువత ఎదురుచూస్తుందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి లేదు... నష్టపరిహారం లేదు... లబోదిబోమంటున్న రైతులు

- రైతుల డిపట్టా భూముల్లో ప్రభుత్వ పాఠశాలలు నిర్మాణం
- నష్ట పరిహారం ఇప్పిస్తామని ప్రిన్సిపల్ సెక్రెటరీ హామీ... నేటికీ అందని భరోసా!

విశాలాంధ్ర-పెదబయలు : ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూమిని ఇచ్చిన తమను ఆదుకోవాలని తమకు నష్టపలహారంతోపాటు ఉపాధి హామీ కల్పించాలని భూ దాతలు నూతన ఏకలవ్య పాఠశాల వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు మండలంలో గల సీత గుంట పంచాయతీ లక్కేపుట్టు గ్రామ లబ్ధిదారులు పివిటిజి వర్గానికి చెందిన 8 మంది డిఫారం పట్టలు కలిగి పురాతన కాలము నుంచి తల్లితండ్రుల యొక్క వంశపార్యమును ఉన్న వాళ్ల యొక్క సాగులో ఉన్న మెట్టు భూమి వ్యవసాయ భూమిని మా వద్ద నుండి ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ గ్రామంలో వచ్చి 8 కుటుంబాల వాళ్లకి పిలిచి సాగులో ఉన్న భూమి విషయంపై నష్టపరిహారం లేదా ఉద్యోగ భద్రత ఉపాధి కల్పిస్తామని ఆశలు కల్పించి ఇంతవరకు మాకు ప్రభుత్వము నుండి ఆర్థికపరమైన భరోసా గాని ఎటువంటి హామీ మాకు ఇవ్వడం లేదని, ఏకలవ్య పాఠశాల ఉపాధి ఉద్యోగ ఉపాధి హామీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు మాకు కలిగిన పోడు వ్యవసాయం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వలన, మ కుటుంబంలో ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నమని, తెలిపారు, పై విషయం పై స్పందనలో జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ కు సంబంధిత అధికారులు కలిసినప్పటికీ నేటి వరకు మాకు ఆర్థిక భరోసా ఉద్యోగ ఉపాధి అందలేదని సంబంధిత అధికారులు కూడా స్పందించడం లేదని పాఠశాల నిర్మించిన భూములు కోల్పోయిన తమకు భరోసా తో పాటు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు రాజారావు కె మోష్యన్న కె బోడన్న, కే సత్తిబాబు కె శశి కుమార్ కె రమేష్ కె నిన్ను బుడ్డి కోరుతున్నారు.

చట్రాపల్లి గిరిజనుల గోడు సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్తాం

జనసేన అరుకు పార్లమెంటు నియోజకవర్గ జిల్లా ఇన్చార్జి ఒంపూరు గంగులయ్య

విశాలాంధ్ర-జికే వీధి : ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చట్ర పల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడడంతో ఇళ్లు, పశు సంపద, ఆస్తులు నష్టపోయిన చట్రా పల్లి గిరిజనులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జనసేన పార్టీ అరకు పార్లమెంట్ జిల్లా ఇన్చార్జి వంపురు గంగలయ్య, జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, పార్లమెంట్ వర్కింగ్ కమిటీ గొర్ల వీర వెంకట, మండల ప్రధాన కార్యదర్శి పుత్తూరు విష్ణుమూర్తి, అన్నారు. సోమవారం కార్యకర్తలతో కలిసి చట్రాపల్లి, మూలగరువు గ్రామానికి సందర్శించి పరామర్శించించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న చట్రాపల్లి గిరిజన 37 కుటుంబలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అరకు పార్లమెంట్ జిల్లా ఇన్చార్జి ఒంపూరు గంగులయ్య మాట్లాడుతూ చట్రాపల్లి గ్రామంపై కొండచరియలు విరుచుకుపడడం చాలా బాధాకర మన్నారు. ఓమహిళ మృతిచెందడం, ముగ్గురు తీవ్రంగా గాయపడడం బాధాకరమైనా విషయమన్నారు. చాట్రాపల్లి గ్రామస్తులకు ప్రభుత్వం అన్నివిధాలగా సహాయ సహకారాలు, గ్రామంలో ప్రతి కుటుంబానికి పక్కా గృహం నిర్మించలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమస్యలు పరిష్కరించే దుకు చాలా అనుభవం ఉన్న ముఖ్యమంత్రి ఆశయం ఉన్న వ్యక్తి అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లేమని మరొక్కసారి క్షేత్రసాయి సందర్శించి పరిశీలించి బాధితలతో మాట్లాడి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి మరొక్కసారి తీసుకువెళ్తామన్నారు. జనసేన పార్టీ గ్రామానికి మీకు అండగా తోడుగా ఉంటుందని బాధితులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం జరిగిందన్నారు. గ్రామానికి జరిగిన సంఘటన పైన ఎంతమేర నష్టం జరిగిందో అధికారులకు స్పష్టమైన అవగాహన ఉందని తెలుసు ప్రభుత్వానికి నివేదికలు వెళ్లయని ఆ నివేదికలను అమలు కావాలని ప్రభుత్వంలో జనసేన పార్టీ భాగస్వామని దీనికి బాధ్యత తీసుకొని భరోసా కల్పిస్తామనీ తెలియజేశారు. అధిక వర్షాలకు ధ్వంసమైన రహదారులు పునరుద్దరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చట్రాపల్లి గిరిజనులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తుంద న్నారు. కొండకు దిగువన ఇళ్లు నిర్మించుకోవడం వల్ల పెను ప్రమాదం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదంలేని స్థలాన్ని కేటాహించాలని కలెక్టర్తో మాట్లాడుతామని అన్నారు. ఎంత పెద్ద అధికారైన మానవీయ కోణంతో

ఆలోచించి గిరిజన ప్రాంతానికి త్వరితగతిన దృఢమైన రోడ్డును ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక చేయాలని జీకే వీధి నుండి సీలేరు వరకు రహదారు పనులు వేగవంతం జరగాలని ఒంపూరు గంగులయ్య ఆర్అండ్బి అధికారులు పాడేరు ఈఈ బాల సుందర్బాబు, విశాఖపట్నం కాంతిమతిని కోరారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్త వీధి, చింతపల్లి, జి.మాడుగుల, మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు ఉల్లి సీతారాం సిద్దు సచ్చారావు వెంకటేష్ రఘువం రమేష్ అశోక్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్కు అనూహ్య స్పందన

మంత్రి సంధ్యారాణి చొరవతో సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర-సాలూరు : రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం,గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి. సంధ్యారాణి నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న రోజులలో తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి వచ్చిన వినతలు స్వీకరించారు.ఇదివరకు ప్రజలనుండి స్వీకరించిన పలు సమస్యలకు పరిష్కారం చూపడంతో వినతులు సమర్పించేందుకు ప్రజలు నియోజకవర్గం నలుమూలల నుండి వస్తున్నారు. సోమవారం ఉదయం మక్కువ మండలం వెంకట భైరిపురం గ్రామానికి చెందిన చొంగలి శంకరరావు తన కుమారుడు 2017వ సంవత్సరం నుండి రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నాడని ఇప్పటికే ఏడు లక్షలు వరకు చికిత్సకోసం ఖర్చు చేశామని మరొక మూడు లక్షల రూపాయలు అవసరమని వైద్యులు తెలిపారన్నారు.ప్రభుత్వ పరంగా ఆర్థికసహాయం చెయ్యాలని కోరారు.సమస్య విని చలించిన సంధ్యారాణి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి దృష్టికి తీసుకువెళతానన్నారు. పాచిపెంట మండలం లో పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్వాసితులైన కొటికిపెంట పునరావస గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామప్రజలు వినతి అందజేశారు. కారాడవలస గ్రామానికి చెందిన యువత సెల్ టవర్,త్రాగునీటి సౌకర్యం కల్పించమన్నారు.కొదమ పంచాయతీ లోని గ్రామాలకు రహదారి నిర్మాణం చేపట్టాలని కొదమ యువత వినతిని అందజేశారు.సమస్యలను సావధానంగా విన్న మంత్రి సంధ్యారాణి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వైద్య ఒప్పంద కార్మికులపై వేధింపులు ఆపాలి

- వేతనబకాయలు చెల్లించాలి
- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని కార్మికులపై వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్య విభాగ ఒప్పంద కార్మికుల అధ్వర్యంలో కార్మికులంతా నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్ లో కలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫార్మ్ ఇవ్వాలని కోరారు .ప్రభుత్వం మారిన తరుణంలో కొన్నిచోట్ల ఒప్పంద కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని తెలిపారు. త్వరలో ఉద్యమం ఉధృతం చేస్తున్నామని అందులో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారి, జిల్లా కార్మికశాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమ్మె నోటీసులు యిచ్చి సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు దుర్గారావు, కుమారమ్మ , చంద్రమౌళి, కావ్య, శంకర్రావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కృషి ఫలించింది... వందే భారత్ ఆగింది...

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో వందే భారత్ రైలు హాల్టకి చేసిన కృషి ఫలించింది. దుర్గ్ నుంచి విశాఖ వరకు నడిపే రైలు ట్రైలర్ పూర్తయింది. ఈనెల 16 నుంచి ముందు షెడ్యూల్ ప్రకారం రాయగడ నుంచి విజయనగరం హాల్టును నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర పార్వతీపురంలో హాల్టు ఉండేలా చేసేందుకు ముందుగా డిఆర్ఎం ను కలిశారు వినతి పత్రం ఇచ్చారు. దీనితో సోమవారం విశాఖలో ప్రారంభమైన వందే భారత్ రైలు పార్వతీపురం (బెలగాం) స్టేషన్లో ఆగింది. వందే భారత్ రైలును ఈ స్టేషన్లో నిలుపుదల చేయడానికి కృషి చేసిన స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్రకు జిల్లా ప్రజలు అభినందనలు తెలిపారు. అలాగే హైదరాబాద్ కేంద్రానికి వెళ్లడానికి ఈ ప్రాంతం నుంచి నాగావళి ఎక్స్ప్రెస్ రైలు మాత్రమే ఉన్నదని ఈ రైలును కూడా పార్వతీపురం స్టేషన్లో నిలుపుదల చేసే విధంగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

విశాలాంధ్ర-కురుపాం : ముస్లిం ప్రవక్త మహమ్మద్ జన్మదినమైన మిలాద్ ఉన్ నబీని స్థానిక ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం శివన్న పేట జామియా మసీదు నుంచి కురుపాం మెయిన్ వరకు మహమ్మద్ ప్రవక్త సూచనలు వివరిస్తూ పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ఆశయాలు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ షేక్ నిసార్, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, మండలం పరిషత్ కోఆప్షన్ మెంబర్ జీలానీ, సామాజిక కార్యకర్త షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ.2.52 లక్షల మండల టీడీపీ నాయకులు సాయం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల తెలుగుదేశం త్రీమ్యాన్ కమిటీ సభ్యులురూ2.52 లక్షల రూపాయల నగదును కురుపాం నియోజకవర్గ శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరికి సోమవారం అందజేశారు. నేతలంతా ఎంఎల్ఏ జగదేశ్వరికి కలిసి అందజేశారు రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధికారి ప్రతినిధి డొంకాడరామకృష్ణ, మండల పరిషత్ అధ్యక్షులు బొంగు సురేష్ లతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ కష్టాలలో ఉన్న బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. విరాళాలు ఇచ్చేందుకు నియోజకవర్గంలోని నేతలు ముందుకు రావాలని కోరారు.

నేడు పాలకొండలో మెగా జాబ్ మేలా : కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్:మంగళవారం పాలకొండలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు.రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి, 18 నుండి 30 సంవత్సరాల వయస్సుగల యువతీ, యువకులు అర్హులన్నారు. జాబ్ మేళా 17వ తేదీ ఉదయం 9 గంటల నుండి పాలకొండ శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. ఈ మెగా జాబ్ మేళకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1050 పోస్టులు ఆయా కంపెనీలలో భర్తీ చేస్తున్నారని ఆయన తెలిపారు. మేలాలో పాసి సెట్టర్ బిజినెస్ సొల్యూషన్స్, ఆల్ సెట్ బిజినెస్ సొల్యూషన్స్, ఎంఎస్ సి కంపెనీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్, పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్, హెటిరో డ్రగ్స్, వింటా ల్యాబ్స్, వశిష్ఠ లైఫ్ సైన్సెస్, పేటియం, అడికో, ముత్తూట్ ఫైనాన్స్, టీం లీజ్ (ఎస్ బిఐకార్డ్స్), అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్పోర్ట్, ఫ్లిప్ కార్ట్, కె ఎల్ గ్రూప్-అమెజాన్ కంపెనీ లు పాల్గొంటున్నాయని చెప్పారు.ఈ కంపెనీలు కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ కెమిస్ట్, ట్రైనీ కెమిస్ట్, ట్రైనీ ఆపరేటర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, పికింగ్ అండ్ ప్యాకింగ్, ప్రొబేషనరీ ఆఫీసర్, టెలి కాలర్స్-ఎగ్జిక్యూటివ్, ఫార్మసీస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసీ అసిస్టెంట్, డ్రైవర్, క్లర్క్, వెహికల్ హెల్పర్ తదితర పోస్టులను భర్తీ చేస్తున్నారని ఆయన వివరించారు.ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను స్కిల్ యూనివర్సిటీ ఏపీ ఎస్ఎస్డిసి వెబ్సైట్లో విధిగా నమోదు చేసుకోవాలని ఆయన చెప్పారు. రిఫరెన్స్ నెంబర్తో పాటుగా రెస్యూమే, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబ్ మేలా జరుగు ప్రదేశంలో హాజరు కావాలని ఆయన అన్నారు. వివరాలకు 6301275511, 7993795796 ఫోన్ నంబర్లకు సంప్రదించ వచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్షిప్లో రూపవతికి 3వ స్థానం

డాక్టర్ టి. హేమాక్షి వెల్లడి

విశాలాంధ్ర-బెలగాం : సీతానగరం మండలం బూర్జ ఆయుర్వేద ఆసుపత్రి ఆయుష్ హెల్త్ & వెల్నెస్లో యోగా శిక్షకురాలుగా పనిచేస్తున్న ఎం. రూపవతి రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్షిప్లో మూడవ స్థానం కైవసం చేసుకున్నారని ఆయుష్ వైద్యురాలు డాక్టర్ టి. హేమాక్షి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ సీతానగరం మండలం బూర్జ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో రెండు సంవత్సరాల క్రితం ఆయుష్ హెల్త్& వెల్నెస్ కేంద్రం ప్రారంభమైందని యోగా శిక్షకురాలుగా ఆమె నియామకం జరిగిందని తెలియజేసారు. ఇప్పటికే ఆ పరిధిలో పలు గ్రామాల్లో డా.హేమాక్షి ఆధ్వర్యంలో యోగా శిక్షణలు, సూచనలు, ఆయుష్ వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని అనేక దీర్ఘకాలిక రోగాలకు, మానసిక వత్తిడికి ఆయుర్వేదం, యోగా మంచి చికిత్స అని, ప్రజల్లో కూడా వీటిపై మరింతగా అవగాహన పెంపొందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి, గ్రామస్తులు రూపవతికి అభినందనలు తెలియజేశారు.

ఏజెన్సీ ప్రజల ఆరోగ్యంపై పర్యవేక్షణ చేయాలి : డిప్యూటీ డిఎంహెచ్ఓ

విశాలాంధ్ర-పాచిపెంట : ఏజెన్సీలో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ టి. జగన్మోహనరావు ఆదేశించారు. డిపిఎంఓ డా.రఘుకుమార్ తో కలిసి మండలంలో మారుమూల గ్రామాలు నీలంవలస, రాయిగుడ్డివలస, జివిఎన్ పేట పిహెచ్సిలను సోమవారం సందర్శించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహణ,సీజనల్ వ్యాదులపై సర్వే, స్ప్రేయింగ్ తదితర నివారణ చర్యల వివరాలపై సిబ్బందిని ఆరా తీసి స్థానికులను అడిగి తెలుసుకున్నారు.హైరిస్క్ సమస్యతో ఉన్న గర్భిణీలను ఏ విధంగా పర్యవేక్షణ చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం నుండి అందజేస్తున్న పౌష్టికాహారం, పిల్లలకు వేస్తున్న వ్యాధినిరోధక టీకా వివరాలపై ఆరా తీశారు. వెల్నెస్ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు అక్కడ గ్రామాలకు ఏమేర దూరంలో ఉన్నాయి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఆరోగ్య కేంద్రాలకు రావడంలో ప్రయాసపడే మారుమూల గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ఎక్కువ దృష్టి సారించాలని, అవసరమైన మందులు,పరీక్షలు వారికి అందుబాటులో ఉంచి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.ఫీడర్ అంబులెన్స్ సర్వీసులపై ఆరా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రహదారి సౌకర్యం లేని గ్రామాల్లో ఉండే గర్భిణీలను ప్రసవానికి ముందుగానే గర్భిణీ వసతి గృహంలో చేర్చాలని సూచించారు.వెల్నెస్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ మారుమూల గ్రామ ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా చొరవ తీసుకోవాలన్నారు.అనంతరం పిహెచ్సిలో రోగులకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీల వివరాలు రికార్డులో పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి ఏ గ్రామాల నుండి వచ్చారో తెలుసుకున్నారు.వార్డులో చికిత్స పొందుతున్న వృద్ధురాలి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. ప్రతీ రోజూ ఎంత మంది జ్వర పీడితులకు చికిత్స అందిస్తున్నారు మరియు మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుపర్వైజర్స్ సిఎంసిఎస్ రెడ్డి, సంపత్ కుమార్, అంగన్వాడీ సూపర్వైజర్ ఇందిరాదేవి, వైద్య సిబ్బంది లక్ష్మి, నందిని, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు కొమరాడ మండల కూటమి పార్టీ, ప్రజలు, నాయకులు సాయం

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : పార్వతిపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం కొమరాడ మండలం కూటమి నాయకులు, ప్రజలు విజయవాడ వరద బాధితుల సహాయార్థం కోసం మూడు లక్షల (3,00,000/-) రూపాయలను గుమ్మలక్ష్మీపురంలో గల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి చేతులమీదగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శేనాపతి శేఖర్‌పాత్రుడు, పొట్నూరు వెంకట నాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి గార గౌరీశంకర్, కిల్లు అనంత్,వాన ఉపేంద్ర, తెంటు శ్రీకర్ కొమరాడ మండలం జనసేన పార్టీ అధ్యక్షులు, అధికారి సుజాత, ఒప్పంగి రాఘవేంద్రరావు ,దత్తి ధర్మ,పడాల హరిప్రసాద్, బత్తిలి శ్రీను, బలరాం, కూటమి నాయకులందరూ పాల్గొన్నారు.

నేటి నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయవలసిన అవశ్యకత ఉందన్నారు. సోమవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈకార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. మహాత్ముడి జయంతి వేళ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీని స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామని ఆయన గుర్తు చేశారు."స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత" ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకోవడం జరుగుతోందని ఆయన వివరించారు. జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించటమే ధ్యేయంగా ముందడుగు వేయాలని ఆయన సూచించారు. సమాజం మొత్తాన్ని భాగస్వాములను చేసేలా పక్షంరోజుల పాటు మూడు ప్రధానఅంశాలపై ఆధారపడి కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

స్వచ్ఛతాకీ భాగీదారి విభాగంలోతగిన ప్రచారంతో ప్రజల భాగస్వామ్యాన్ని, అవగాహనను ప్రోత్సహించడానికి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవ హారాలు నిర్వహించాలని ఆయన అన్నారు. మొక్కల పెంపకంతో పాటు ఇతర సుందరీకరణ పనులు చేపట్టవలసి ఉందన్నారు. స్వచ్ఛత లక్షిత్ ఏకాయి - సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాలలో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ, పరిశుభ్రత లక్ష్య సాధన కోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపాలని ఆయన పేర్కొన్నారు. సఫాయిమిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలు చేపట్టాలని , ఆరోగ్య శిబిరాల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయటం తదితర అంశాలను చేపట్టాలని ఆయన చెప్పారు. వారికి ప్రత్యేకంగా భద్రతా శిక్షణలు, పిపిఇ కిట్లు అందజేయాలని పేర్కొన్నారు. పరిశుభ్రతను కాపాడే క్రమంలో పౌర భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

రోజువారీ కార్యక్రమాల వివరాలు : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, ఆరోగ్య సంరక్షణ సేవలు, 18న స్వచ్ఛత పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ, 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి మంజూరైన పథకాలతో అనుసంధానం చేయాలన్నారు. 20న మొక్కల పెంపకం, 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీ లు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పీపీఈ కిట్‌లు, సేఫ్టీ గేర్లు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహణ, 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత, 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రలు - వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఆయన చెప్పారు . 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం, 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని , 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల సుందరీకరణ, టూరిస్ట్ పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు, 28న సాలిడ్ వేస్ట్ మెనేజ్మెంట్ ఆస్తుల సుందరీకరణ, పునర్వినియోగానికి పనికొచ్చే ఇ-వ్యర్థాల సేకరణ, 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన, 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు చేయాలని, అక్టోబరు 1న విద్యా సంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

వెలమవారి వినాయకచవితి కమిటీ ఆధ్వర్యంలో ఐదువేల మందికి అన్నసంతర్పణ

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని వెలమవారివీధిలో సోమవారం వినాయక చవితి కమిటీ ఆధ్వర్యంలో 5వేలమందికి పైగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెలికాని వెంకటగోపాలకృష్ణ, ఎస్ కన్నారావులు తెలిపారు. అన్ని గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి వినాయకుడును దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో సాల హరిగోపాలరావు, సుంకరిపలి ప్రసాదరావు, కంకణాలపల్లి అరవింద్ కుమార్, దేవురపల్లి కిరణ్ కుమార్, ముప్పాళ్ళ శ్రీనివాసరావు,కాంకణాలపల్లి హరనాథ్,అనిల్, తనూజ్ కుమార్, ముప్పాల నాగేశ్వరరావు,సతీష్ తదితరులతో పాటు కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

నేడు కుమ్మరివీధిలో... మంగళవారం నాడు కొమర వీధిలో పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని శాలివాహన నాయకులు తెలిపారు. మండలంలోని భక్తులంతా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు గూడెంవీధిలో... మండలంలోని బుదవారంనాడు గూడెం వీదిలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వినాయక ఉత్సవ కమిటీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.బుధవారంతో మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాలు పూర్తవు తాయని ఎస్ఐ రాజేష్ తెలిపారు. అన్ని గ్రామాల్లో పెద్దలు,నాయకులు, యువత సహాయ సహకారాల వల్ల వినాయక నిమజ్జనంలు శాంతియుతంగా జరిగాయని చెప్పారు.

వంట కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్

విశాలాంధ్ర-సీతంపేట : సిఐటియు కార్యాలయం ఆవరణంలో జరిగిన మధ్యాహ్నం భోజనం వంట కార్మిక సంఘం సమావేశంలో, ఆయన మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని,గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ,ప్రమాద బీమా వర్తింప చేయాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, వంట కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం సీతంపేట మండలం అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రొయ్య భారీ,బిడ్డిక ఉష, మండలంలో గల వంట కార్మికులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మార్క్సిస్టు యోధుడు సీతారాం ఏచూరి

- పీడిత ప్రజల ఆశాజ్యోతి, మార్క్సిస్టు యోధుడు
- బలమైన భావజాల ఉద్యమమే నిజమైన నివాళి

విశాలాంధ్ర-పాడేరు : ఎందరో ప్రపంచ మేధావుల ప్రశంసలతో ఖ్యాతి పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి,మార్క్సిస్టు యోధుడు సీతారాం ఏచూరిగా, ఒక చరిత్రకారుడిగా జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస కొనియాడారు.స్థానిక పీఎంఆర్సి భవనంలో సోమవారం ఏచూరి సీతారాం సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఎల్ సుందర్రావు అధ్యక్షతన జరిగిన సభలో అప్పల నర్స మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత సిపిఎం నేతగా ఏచూరి ప్రపంచ దేశాల్లో కీర్తిని గుర్తింపును పొందారని కొనియాడారు.నిరంతరం ప్రజా సమస్యలపై పోరు సాగిస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగట్టి దేశ రాజకీయాల్లో ఒక కీలక భూమి పోషించారని ఆయన ప్రశంసించారు. బిజెపి మతతత్వ విధానాలను వ్యతిరేకించి దేశ అభ్యున్నతికివి ఎంత ప్రమాదమో ఏచూరి నినదించారన్నారు. సాటి మనిషిని, మనిషిలా చూడాలన్నదే ఆయన అభిమతంగా ఉండేదన్నారు.

వరల్డ్ బ్యాంకు ఒప్పందాలు ఎంత ప్రమాదకరమైనవో దేశంలో ప్రైవేటీకరణ పెట్టుబడిదారీ వ్యవస్థ పెరగడంవల్ల విచ్ఛిన్నకర పరిస్థితులు సంభవిస్తాయని రైతు, కార్మిక, విద్యార్థి, పేదల, స్థితిగతులు విచ్ఛిన్నమవు తాయని హెచ్చరించి వాటిని వ్యతిరేకించి పోరు సాగించారని అన్నారు. విశిష్టమైన శైలి లక్షణాలు కలిగిన సిపిఎం నేతగా ఏచూరి ఎందరో మేధావు లను ఆకట్టుకున్నారని చెప్పారు ఏచూరి ఎంత గొప్ప వ్యక్తి అంటే దేశానికి నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ వంటి వారు ఏచూరిని కీర్తించారని అన్నారు దేశంలో ఎందరో సిపిఎం నేతలు మరణించారని మునుపెన్నడు వారి అంతిమ యాత్రలకు బిజెపి నేతలు హాజరైన పరిస్థితి లేదని అయితే ఒక్క ఏచూరి భౌతిక కాయాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నివాళి అర్పించారు. జన హృదయాలలో ఏచూరి శాశ్వతంగా నిలిచిపోతారని ఆయన కొనియాడారు. ఆదివాసీ సమస్యలపై జాతీయ స్థాయిలో ఏ రాజకీయా పార్టీకి లేని డాక్యుమెంట్ ను రూపొందించిన సి.పి.ఎం పార్టీ మాత్రమే నని అన్నారు.ఈ సంతాప సభలో సిపిఎం జిల్లా నాయకులు పాలికి లక్కు బాలదేవ్ బహుభాషా వాలంటీర్ల సంఘం నాయకులు మర్రి చిట్టిబాబు పాంగి శ్రీను పాంగి కుమారి వివిధ కార్మిక సంఘాల నాయకులు విద్యార్థులు మహిళా సంఘాల ప్రతినిధులు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

విరాళాలు అందజేస్తున్న నాయకులు

విశాలాంధ్ర-సీతానగరం : విజయవాడ వరద బాధితులకు సహాయార్థం శాసనసభ్యులు విజయ్ చంద్ర పిలుపుమేరకు మండలంలోని అన్నిగ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్పందించి విరాళాలు అంద జేస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, రౌతువేణుగోపాలనాయుడులు తెలిపారు.సోమవారం ఏగోటివలస గ్రామానికి చెందిన యాదవ సంఘం తెదేపా నాయకులు ముఖ్యమంత్రి సహాయ నిధికి పదివేల రూపాయల విరాళంగా ఇచ్చారని చెప్పారు. పనుకుపేట గ్రామం నుండి ఐదువేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల నుండి పెద్ద ఎత్తున విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆదేశాలు సూచనలు ప్రతి ఒక్కరు గమనించి ముందుకు రావాలన్నారు.

నలబై వేలు పలికిన వినాయకుడు లడ్డు

విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని మొండెం ఖల్లులో శ్రీశ్రీ సిద్ధివినాయక ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి 8:30 లడ్డు వేలం పాట కరెన్సీ వేలంపాట తోటపల్లి వీధిలో నిర్వహించారు. గ్రామస్తులందరూ హాజరు కాగా లడ్డు వేలంపాటలో 40 వేలు రూపాయలకు మజ్జి ప్రసాద్ కుటుంబం సొంతం చేసుకున్నారు. అలాగే వినాయకుడు మెడలో వేసిన కరెన్సీ నోట్లు వేలంపాట 27వేల రూపాయలు బెహరా లక్ష్మీనారాయణ కుటుంబం కలిసి సొంతం చేసుకున్నారు. సర్పంచి ఐ.గౌరీ శంకర్‌రావు, ఎంపీటీసీ గుడారి విద్యరాణి, మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ రంజిత్ కుమార్ నాయక్, ట్రైబల్ రైట్స్ ఫోరం లోవరాజు, ఐ.రామకృష్ణ మహిళ సంఘ అధ్యక్షురాలు కుమ్మరి నీలమ్మ భగవాన్ మిశ్రో, తోటపల్లి వీధి యూత్ లీడర్స్ గుడారి రామారావు. ఐ.రఘు. తదితరులు పాల్గొన్నారు.

మాజీ సహకార సంఘం అధ్యక్షురాలు మృతి

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని కాసాపేట మాజీ సహకార సంఘం అధ్యక్షురాలు, టీడీపి నాయకురాలు తేలు అన్నపూర్ణమ్మ (70) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో మృతిచెందారు. ఆమె మాజీజెడ్పీటిసి తెంటు సావిత్రమ్మకు తల్లికాగా, మాజీ టీడీపీ అధ్యక్షుడు తెంటు వెంకట అప్పలనాయుడుకు అత్తగారు కావడం గమనార్హం. ఆమెమృతిపట్ల నియోజక వర్గంలోని, మండలం లోని నాయకులు ప్రజాప్రతినిధులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఆమె కుటుంబ సభ్యులైన తేలుకామినాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడులను పలువురు పరామర్శించారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని వెంకటప్పల నాయుడు తెలిపారు.

కనోసా ఆసుపత్రిలో వైద్యురాలి నిర్లక్ష్యంతో తల్లి, బిడ్డలు మృతి

విశాలాంధ్ర-జియమ్మవలస/వీరఘట్టం : మండలంలోని ఇటిక గ్రామానికి చెందిన వారాడస్వాతి(23) భర్త శంకరరావుతో మూడేళ్ల క్రితం వివాహంకాగా, మూడేళ్ల తరువాత తన భార్య పండంటి బిడ్డకు జన్మనిస్తుందని సంబరపడిన కొన్ని ఘడియలకే తన భార్య, బిడ్డ మృత్యువాత పడిందని తెలిసిన భర్త శంకరరావు రోదన వర్ణనాతీతం. వివరాలలోకి వెళితే ఇటిక గ్రామానికి చెందిన వారాడ శంకరరావుతో వీరఘట్టం మండలం దశమంతపురం గ్రామానికి చెందిన స్వాతి(23)తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. స్వాతి గర్భిణీకాగా ఆమెకు మొదటి కాన్పు కావడంతో కన్నవారిల్లు దశమంతపురంలో ఉండడంతో ఆమెకు పురిటి నొప్పులు రావడంతో వీరఘట్టం దగ్గరలోగల కనోస ఆసుపత్రిలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో చేర్పించారు. స్వాతికి వైద్య పరీక్షల అనంతరం సాధారణ ప్రసవం అవుతుందని ముందుగా వైద్యురాలు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు, భర్త, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అదే వైద్యురాలు ఆపరేషన్ చేసి బిడ్డను తీయాలని చెప్పిన గంట వ్యవధిలోనే స్వాతితో పాటు గర్భంలో ఉన్న శిశువు కూడా సాయంత్రం 4 గంటలకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం చెందుతూ బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యురాలి నిర్లక్ష్యం కారణంగానే తనభార్య, బిడ్డ మృత్యువాత పడ్డారని తెలిసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న శంకరరావు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది.

నేడు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు

విశాలాంధ్ర-సీతంపేట : మండలం పరిధిలోగల అన్ని యాజమాన్య పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయు, రేపు అనగా17.09.2024 తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు బాలురుకు మాత్రమే ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు) సీతంపేట యందు జరుగును అని తెలిపారు. ఈ క్రీడలకు బాలుర పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులతో తప్పనిసరిగా హాజరు కావలెను, పాఠశాలలో క్రీడాకారులు ఎంపిక చేసి తీసుకొని రావలెను అని క్రీడల విభాగము, ఐటీడీఏ, సీతంపేట వారు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

నేడు విశ్వకర్మ జయంతి నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం : విశ్వకర్మ జయంతి ఉత్సవంను మంగళవారం నిర్వహించడం జరుగుతోందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. జిల్లా అధికారులు, బిసి సంఘనాయకులు పెద్ద ఎత్తున విశ్వకర్మ జయంతిఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మెగా వైద్య, రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

తేదేపా రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ దేవ్

విశాలాంధ్ర-కురుపాం : నేడు వైరిచర్ల నివాస ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరం ను కురుపాం నియోజకవర్గంలో ఐదు మండలాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ కోరారు.సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి విజయనగరం మిక్స్ ఆసుపత్రి నుంచి ఆప్తాలమిక్, గైనిక్, జనరల్ మెడిసిన్, పీడియా ట్రిక్ ,ఆర్థో వైద్య నిపుణులు రానున్నారని ఈ సదావకాశం అందరూ సద్వినియోగం చేసుకోవాలనికోరారు.అలాగే మెగా రక్తదాన శిబిరం లో యువత పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలువాలని సూచించారు.

ఘనంగా సిద్ధి బుద్ధి కళ్యాణం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని మెయిన్ రోడ్ బాలాజీ థియేటర్ పక్కన శ్రీ ధ్యాన శివ గణపతి. మహోత్సవంలో భాగంగా సోమవారం నాడు గణేష్ యూత్ ఆధ్వర్యంలో సిద్ధి బుద్ధిల కళ్యాణం ఘనంగా నిర్వహించారు.గ్రామ పురోహితులు వేమకోటి ఉమాకాంత్ శర్మ వేద మంత్రాలతో విగ్నేశ్వర సిద్ధిబుద్ధి కళ్యాణం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూప్రతి సంవత్సరం వినాయక నిదించడం జరుగుతుందని గణనాథుడికి పూజ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా చేయడం జరుగు తుందని తెలిపారు.కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మూడోసారి సిద్ధి బుద్ధి కళ్యాణం చేయడం జరిగిందని తెలిపారు.ఈ కళ్యాణం లో దంపతులు కమిటీ సభ్యులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అన్న సంతర్పణ

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు ఒడ్డున ఉన్న నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన గణేశ్వర ఆలయంలో సోమవారం అన్నదానం (అన్న సంతర్పణ) ఘనంగా నిర్వహించారు. ఒడ్డున ఉన్న ప్రజలు భక్తి శ్రద్ధలతో గణనాథునికి పూజలు నిర్వహించారు. అన్నదానానికి వేలాది మంది వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాజేష్, నాగరాజు, సరెడ్ల నాగేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ గురువారం నిమజ్జనం జరుగుతుందని తెలిపారు.

మూడున్నర తులాల బంగారం అపహరణ

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలం చిట్టపూడి వలస గ్రామానికి చెందిన యామక గౌరమ్మ మూడున్నర తులాల బంగారాన్ని సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని బంగారాన్ని తెంచి అపహరించుకుపోయినట్లు ఆమె తెలిపారు. ఈమె వ్యవసాయ శాఖలో ఎన్ ఎఫ్ జెడ్ గా విధులు నిర్వహిస్తూ పంట పొలాల్లో ఉన్న రైతులకు సలహాలు ఇచ్చేందుకు ఇంటి వద్ద నుండి వస్తుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై తన్ను వెంబడించి మెడలో బంగారం తెంచి వేయటంతో తను పడిపోయి ,ద్విచక్ర వాహన వ్యక్తి పడిపోవడంతో పట్టుకునేందుకు సాహసించినప్పటికీ ఆ వ్యక్తి తక్షణమే ద్విచక్ర వాహనం పట్టుకుని పరారయ్యాడని వెంటనే పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై జి కళాధర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కడకల్లా కిమ్మి గ్రామాలు వైపు కూడా పరిశీలన చేసి కడకల్లా గ్రామంలో దేవాలయంలో ఉన్న సిసి కెమెరా ఫుటేజ్‌లు కూడా పరిశీలించడం జరిగిందని ఆయన తెలిపారు. గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీరఘట్టంలో బంగారం అపహరణ జోరు : మండలంలో బంగారం అపహరణ జోరుగా సాగుతుంది.మండలంలోని హుస్సేన్ పురం గ్రామానికి చెందిన ఐదాల తవిటమ్మ ఈ ఏడాది జూన్ 21తేదీన స్వగ్రామం నుండి బొడ్లపాడు గ్రామ కాలువ గట్టుపై మీదుగా పాపంపేట గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు కాపు కాసి మెడలో ఉన్న రెండు తులాల బంగారం అపహరించక పోయినట్లు ఆమె కూడా పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. 25 రోజుల కిందట వండవ గ్రామ సమీపంలో శివాలయం కోవెల వద్ద పూజరమ్మ మెడలో రెండు తులాలు బంగారం దొంగిలించినట్లు ఫిర్యాదుల పేర్కొన్నారు. మండలంలో ఎప్పటికప్పుడు బంగారం అపహరణ జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.

వైటీసీ కేంద్రంలో 18న మేము సైతం రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-సీతంపేట : వైటిసి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించబడును ఏపీడీవో గీతాంజలి పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కేంద్ర ప్రభుత్వము, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న "మేము సైతం" రక్తదాన శిబిరంలో 18 సంవత్సరాలు దాటిన యువతి యువకులు పాల్గొని రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని తెలిపారు.

జల ప్రవాహానికి జడిసి పోయాం... ప్రాణభయంతో పరుగులు తీశాం

మూలగరువు, చట్రాపల్లి వరద బాధితులు

విశాలాంధ్ర-చింతపల్లి : జల ప్రవాహానికి జడిసిపోయి ప్రాణ భయంతో పరుగులు తీశామని జీకే వీధి పంచాయతీ మూలగరువు గ్రామస్తులు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు ఎదుట వాపోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో నష్టపోయిన బాధితులను పరామర్శించేందుకు ఆ గ్రామానికి వెళ్లిన అప్పారావుతో గ్రామస్తులు సెప్టెంబర్ 8న చోటుచేసుకున్న విషయాలను ఆయనతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా పైనుంచి ప్రవహిస్తున్న వరద ఉధృతిని రాత్రిపూట అయినప్పటికీ ముందుగా గమనించి ప్రాణ భయంతో పరుగులు తీశామని, పైన ఉన్న తమ బంధువుల ఇళ్లలో తలదాచుకున్నామని, ఉదయం వచ్చి చూసేటప్పటికి తమ గృహాల ఆనవాళ్లు కూడా తమకు కనిపించకుండా కొట్టుకుపోయాయన్నారు. పెద్ద పెద్ద వృక్షాలతో కూడిన బండ రాళ్లు దర్శనమిచ్చాయన్నారు. ఇనుప విద్యుత్ స్తంభాలు సైతం వంగిపోయిన దృశ్యాలు చూసి బీతిల్లామన్నారు. గృహాలు కోల్పోయిన తమకు వెంటనే గృహాలు ఏర్పాటు చేయాలని, అదే క్రమంలో ఎటువంటి ఆధారం లేని తమకు ఆధార్, రేషన్ కార్డులు కల్పించాలని బాధితులు ఆయనను కోరారు.

మంచి మనసున్న వ్యక్తి ఎస్ఐ ప్రయోగమూర్తి

విశాలాంధ్ర-పాలకొండ : వీరఘట్టం రోడ్డు సమీపంలో బైక్‌పై వెళుతుండగా మార్గమధ్యంలో సోమవారం ఒక ఇంటిగుమ్మ లో పడిపోయిన బైక్ యజమాని దాక్షవరపు శివ గెడ్డకుమ్మర వీధికి చెందిన వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్న శివను చూసి అప్పుడే వెళ్తున్న ఎస్సై ప్రయోగమూర్తి గాయాలపాలు అయ్యున్న శివను చూసి తన పోలీస్ వాహనములో ఎక్కించుకొని గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు ఆ శివ కుటుంబం వ్యక్తులకు శివ పడిపోయి ఉన్న పరిస్థితిని వివరించారు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ లో ట్రీట్మెంట్ అందించమని డాక్టర్లకు ప్రయోగమూర్తి మరియు సిబ్బంది ట్రీట్మెంట్ అందించారు పోలీస్ వాహనం లో శివను సతెచ్చినందుకు పోలీసులను కుటుంబీకులు కృతజ్ఞతలను తెలిపారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బెలగాం : కోనేరులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పార్వతీపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం వైకేఎం కాలనీకి చెందిన కునుకు రాంప్రసాద్ (34) ఆదివారం పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో ఉన్న తన స్నేహితుడు ఆహ్వానం మేరకు గ్రామంలో వినాయక నిమజ్జనంకు వెళ్లి ఇంటికి వచ్చి మరల కాలకృత్యాలు తీర్చుకొనేందుకు నర్సిపురం గ్రామం వైపు వెళ్ళాడు. నర్సిపురం గ్రామ సమీపంలో ఉన్న మంచి నీటి కొనేరుకు వెళ్లి మెట్ల వద్ద పొరపాటున కాలుజారి కొనేరులో పడి మృతి చెందాడు. సోమవారం మృతదేహం నీటిలో తెలియాడడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందచేశారు. పార్వతీపురం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ దినకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విజయవాడలో పిహెచ్‌సి వైద్యుల ధర్నా

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట : జిఓ 85 రద్దు చేయాలని, పి హెచ్ సి వైద్యుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నేడు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తెలిపారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో నేడు దర్నా చేస్తామని చెప్పారు.అందరు ప్రాదమిక ఆరోగ్య కేంద్రంల వైద్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వైద్యులు తెలిపారు. వైద్యుల చలో విజయవాడకు పిలుపు నివ్వడంతో నేటి నుంచి అన్ని పి హెచ్ సి లో వైద్య సేవలు నిలువనున్నాయన్నారు.

ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ డిఆర్‌హెచ్‌పి సెబీకి దాఖలు

విశాలాంధ్ర-పాడేరు : ఇండియన్ ఎలక్ట్రిక్ టూ-వీలర్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ భారతదేశంలోని అన్ని ఉత్పత్తులను గ్రౌండ్-అప్‌లో డిజైన్ చేసే ప్యూర్ ప్లే ఈవీ కంపెనీ. క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్‌తో డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ని దాఖలు చేసింది. ప్రారంభ పబ్లిక్ ద్వారా నిధులను సేకరించడానికి సెబీ సమర్పణ కంపెనీని తరుణ్ మెహతా, స్వప్నిల్ జైన్ హీరో మోటోకార్ప్ లిమిటెడ్ ప్రమోట్ చేస్తున్నారు. బెంగళూరు హెడ్‌క్వార్టర్డ్ కంపెనీ యొక్క ఐపిఓ ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూతో కలిపి రూ. 3,100 కోట్లు 2,20,00,766 వరకు ఈక్విటీ షేర్లను విక్రయించే వాటాదారుల ద్వారా అమ్మకానికి ఆఫర్ విక్రయించే వాటాదారులలో ఇవి ఉన్నాయి. ప్రమోటర్ అమ్మకం వాటాదారులు: తరుణ్ సంజయ్ మెహతా - 1,000,000 వరకు ఈక్విటీ షేర్లు, స్వప్నిల్ బాబూన్‌లాల్ జైన్ 1,000,000 వరకు ఈక్విటీ షేర్లు, కార్పొరేట్ అమ్మకం వాటాదారులుగా వున్నారు.

పాలకొండ డిఎస్పీగా ఎం.రాంబాబు

విశాలాంధ్ర-పాలకొండ : సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా(డి.ఎస్.పి) ఎం.రాంబాబును ప్రభుత్వం నియమించింది. ఈమేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని వెలమవారి వీధిలో, పలు గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. మేళతాళాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో డప్పులతో పటాస్ సామాగ్రితో డిజె సౌండ్‌తో నిమజ్జన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి వినాయకుడును దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో కమిటీ నాయకులు గోపాలకృష్ణ, కన్నారావు, సాల హరిగోపాలరావు, సుంకరిపలి ప్రసాదరావు, కంకణాలపల్లి అరవింద్ కుమార్, దేవురపల్లి కిరణ్ కుమార్, ముప్పాళ్ళ శ్రీనివాసరావు, కాంకణాలపల్లి హరనాథ్,అనిల్, తనూజ్ కుమార్, ముప్పాల నాగేశ్వరరావు, సతీష్ తదితరులతో పాటు కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో కూడా ప్రశాంతంగా నిమజ్జనం కార్యక్రమాలు జరిగినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. మిగిలిన గ్రామాల్లో మంగళ బుధవారాల్లో పూర్తికానున్నాయని ఆయన తెలిపారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
మంగళవారం 17, సెప్టెంబరు 2024

గురుకుల కళాశాల వేధింపులపై విచారణ

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యార్థులపై వేధింపులు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనలపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం వెంటనే స్పందించి రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్ జాన్‌రాజును ఎంక్వైరీ అధికారిగా నియమించడం జరిగింది ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థులపై ప్రిన్సిపాల్ జి.ప్రసూన వేధిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన నా దృష్టికి రావడం జరిగిందని పూర్తిస్థాయి దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్ రాజును ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్‌పై దర్యాప్తులో తప్పు అని రుజువు అయిన ఎడల శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం లో సోమవారం వినాయకుని నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిపారు.బస్ సెంటర్, వాల్మీకి వీధి లలోని ప్రతిష్టించిన గణపతి విగ్రహాలను ట్రాక్టర్ లపై పలు గ్రామాలు ఊరేగిస్తూ దేవరమడుగుల పెద్దేరు లో నిమజ్జనం చేశారు. యువత డిజె పాటలతో డ్యాన్సులు వేశారు.

వందే భారత్ రైలుకు, కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

పార్వతీపురం మన్యం జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, యువకులు, ప్రయాణికుల నీరాజనాలు

విశాలాంధ్ర-పార్వతీపురం : విశాఖపట్నం నుంచి దుర్గ వరకు ఏర్పాటు చేసిన వందే భారత్ రైలుకు, మొదటిసారిగా పార్వతీపురం విచ్చేసిన కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతవాసులు ఘనస్వాగతం పలికారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో వారంతా ఘనస్వాగతం పలికి ఆహ్వానించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో హాల్ట్ కూడా కల్పించడం పట్ల వారంతా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. రైలులో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, రైల్వే ఉన్నతాధికారులు రాగా వారికి పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు టిడిపి బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు ప్రయాణికులు యువతీ యువకులు అన్ని వర్గాల వారు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి, పార్వతీపురం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం కురుపాం పాలకొండ నియోజకవర్గంల నాయకులు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారంతా మాట్లాడారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే విజయ్ చంద్రన్న ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ముందు ముందు మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ళు జిల్లా కేంద్రంకు వచ్చేలా ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులు మృతి : ఎస్ఎఫ్ఐ డిమాండ్

విశాలాంధ్ర-జికే వీధి : గూడెం కొత్త వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థి గొల్లూరి మోహన్ దాస్(15) 10వ తరగతి చదువుతున్న విద్యార్థి తమ స్వగ్రామంలో అనారోగ్యంతో మరణించారు. అలాగే గూడెం మండలం ఆర్ వి నగర్ బాలికఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జంపరంగి, దార మల్లేశ్వరి వైజాగ్ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం నాలుగు గంటల టైం కి మరణించడం జరిగింది. ఇదంతా కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే విద్యార్థినీ విద్యార్థులు మృతి చెందుతున్నరాని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు ఆరోపించారు. గిరిజన విద్యార్థిని విద్యార్థులు అంటే రాష్ట్ర ప్రభుత్వం , ఐటీడీఏ అధికారులు చిన్న చూపు చూస్తున్నారని, విద్యార్థిని విద్యార్థుల మరణాలపై సమాధానం చెప్పాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే నష్టపోయిన విద్యార్థినీ విద్యార్థుల కుటుంబానికి ఎక్స్ గ్రేషియా 25 లక్షలు చెల్లించాలని, విద్యార్థిని విద్యార్థులు మరణించడానికి కారణం మెను ప్రకారంగా భోజనం పెట్టకపోవడం ఉడికి ఉడకని అన్నం పెట్టడం, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య శిబిరాన్ని నియమించకపోవడం, అలాగే పిల్లలు తీసుకునే ఆహారంలో సరైన పౌష్టిక క్యాలరీస్ లేకపోవడం వలన విద్యార్థులు చనిపోతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ అన్నారు. విద్యార్థిని విద్యార్థులు మరణిస్తున్నారంటే అది కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమేనంటూ, ఎస్ ఎఫ్ ఐ డిస్టిక్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీను అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మరణించిన విద్యార్థిని విద్యార్థులపై జ్యూడిషల్ విచారణ జరిపించి, విద్యార్థులకు న్యాయం చేయాలని నష్టపోయిన విద్యార్థుల కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్య శాఖ మంత్రి లోకేష్ స్పందించి..విద్యార్థుల మరణాలను ఆపాలని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏజెన్సీ 11 మండలాల్లో ప్రతి ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల కళాశాలలో, కేజీబీవీ హాస్టల్స్‌లో మెన్ సక్రమంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అలాగే రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థిని విద్యార్థుల మరణాల పట్ల చొరవ తీసుకొని హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్తీక్ శ్రీను, సెక్రెటరీ జీవన్ కృష్ణ, చిన్నారావ్, సింహాద్రి, గోపాల్, నితిన్తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ప్రధాన రహదారికి మోక్షం ఎప్పుడు?

విశాలాంధ్ర-చింతపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల మీదుగా ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణలకు వెళ్లే ప్రధాన రహదారి పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా దర్శనమిస్తుంది. నాటి బ్రిటిష్ పాలకులు నిర్మించిన ఈ ప్రధాన రహదారికి మన పాలకులు కనీసం మరమ్మత్తులు చేసిన దాఖలాలు లేవు. తరాలు, ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా, ఉమ్మడి విశాఖ జిల్లా నుండి చింతపల్లి, జీకే విధి మండలాల మీదుగా దారకొండ దారాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని గాని, ఇటువైపుగా ఇతర రాష్ట్రాలకు ప్రయాణించే వాహనాలను, ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని గాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంతర్ రాష్ట్ర రహదారి పునర్నిర్మాణానికి ఏనాడు ఆలోచన చేయలేదు. దీంతో ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. పలుమార్లు ఆర్టీసీ సర్వీసులు ఈ రహదారిలో అర్ధరాత్రి పూట ఆగిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ మధ్యకాలంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా రహదారులు గుంతల సమయం అవ్వడమే గాక, కల్వర్టులు, వంతెనలు కొట్టుకు పోవడం, కొండ చరియలు విరిగిపడి బండరాళ్లు, వృక్షాలు, మట్టి రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం విదితమే. ఇటువంటి పరిస్థితులు ఉన్న మన్యం రహదారి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడం మన్య ప్రాంతంపై పాలకులకు ఉన్న సవతి ప్రేమకు నిదర్శనం.

మొత్తం పోతే గానీ అంతర్రాష్ట్ర రహదారిని పునర్ నిర్మించరా... బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అప్పారావు : మన్యవాసులకే గాక మైదాన ప్రాంత వాసులకు అదేవిధంగా ఇతర రాష్ట్రాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండే గూడెం కొత్త వీధి, సీలేరు ప్రధాన రహదారి మొత్తం శిథిలమై అటు వాహన చోదకులు, ఇటు ప్రయాణికులు పూర్తిగా ఇబ్బంది పడితే కానీ ఇది రహదారిని పునర్ నిర్మించారా అని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అప్పారావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతవాసులపై పాలకులకు చిన్న చూపు ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మన్య ప్రాంతంలో ప్రకృతి సహజ సిద్ధ వనరులపై ఉన్న ప్రేమ మన్య ప్రాంత ప్రజలపై లేదన్నారు.మన్య ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను తరలించుకు పోయేందుకు జాతీయ రహదారుల పేరిట విస్తారమైన రహదారులు నిర్మిస్తున్న పాలకులు ప్రయాణీకులు, దారాలమ్మ తల్లి భక్తులతో నిత్యం రద్దీగా ఉండే అంతర్రాష్ట్ర రహదారిని కనీసం పట్టించుకోక పోవడం దారుణ మన్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి దారకొండ మీదుగా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పునర్నిర్మాణానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వైకాపా మహిళా ఎంపిటీసి పై తెదేపా వర్గీయుల దాడి

కులం పేరుతో దూషించి విలువైన మెడలో ఉన్న ఆభరణాలు పట్టుకుపోయారు

మరుపల్లి ఎంపిటిసి సీతారాం

విశాలాంధ్ర-సాలూరు : మండలంలో మరుపల్లి ఎంపిటిసి జన్ని సీతారాం పై తెదేపా వర్గీయులు ఆదివారం రాత్రి దాడిచేశారు.ఆమె ప్రస్తుతం సాలూరు ఏరియా ఆసుపత్రి లో చికిత్సపొందుతున్నారు. సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ గ్రామంలో వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన డిజె విషయం లో గొడవ జరిగినట్లు తెలిపారు.గ్రామంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళ డిజె తో భాదపడుతున్న విషయాన్ని పోలీసులుకు పిర్యాధు చేసింది.దీనితో పోలీసులు గ్రామంలోకి రావడంతో వైకాపా వారే పిర్యాదు చేశారని భావించి తెదేపా వర్గీయులు గొడవకు దిగారు.ఈ గొడవలో ఎంపిటిసి పై గ్రామంలో తెదేపా కు చెందిన కసినబోయిన వెంకటరమణ,సీతం నాయుడు,వినయ్ తదితరులు తనపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు.ఈ దాడిలో తన మెడలో ఉన్న నల్లపూసలు,పుస్తెలతాడుని తెంపుకొని పోయారన్నారు.నగలు ఇచ్చేయాలని కోరిన ఇవ్వకుండా పట్టుకుపారిపోయారన్నారు.తనపై దాడిచేసిన వారిని శిక్షించాలని పోలీసులకు దాడిచేశానని తెలిపారు.

మూలగరువును ముంచెత్తిన వరద ప్రవాహం

పూర్తిగా కొట్టుకుపోయిన మూడిళ్ళు... నిరాశ్రయులైన గిరిజనులు

బీఎస్పీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు అప్పారావు

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రకృతి ప్రకోపంలో చిద్ర.మైన గిరజన కుటుంబాలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు అన్నారు. వరద బాధిత గ్రామాలను సందర్శించిన ఆయన ఆయా గ్రామాలకు ప్రజలను అడిగి పరిస్థితిని అర్థం చేసుకున్న అనంతరం మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత వారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడడంతో పాటు ఉధృతంగా ప్రవహించిన వరద ప్రవాహానికి అటు మూల గరువు, ఇటు చట్రాపల్లి సహా జీ కే వీధి మండలంలోని పలు పంచాయతీలకు చెందిన ఎన్నో గ్రామాలు వరద ముంపుతో తీవ్రంగా నష్టపోయాయన్నారు. ఇందులో మూలగరువు గ్రామంలో 18 కుటుంబాలు నివాసం ఉంటుండగా వరద ముంపులో మూడు గృహాలు పూర్తిగా కొట్టుకుపోయాయన్నారు. వరద ముంపును ముందుగా గుర్తించిన ఆ గృహాలలోని గిరిజనులు ప్రాణభయంతో పైనున్న గృహాల వద్దకు పరుగులు తీసి ప్రాణాలు రక్షించుకున్నారన్నారు. ఇంతలోనే భారీ వృక్షాలు, బండ రాళ్ళతో ఒక్కసారిగా ముంచు కొచ్చిన వరద ప్రవాహం మూడిళ్ళను నామ రూపాలు లేకుండా కొట్టుకు పోవడంతో ఆ మూడు కుటుంబాల గిరిజనులు నిరాశ్రయులయ్యారన్నారు. అధారాలన్నీ కోల్పోయి కట్టు బట్టలతో మిగిలిన అ గిరిజన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఇదే క్రమంలో దయనీయంగా తయారైస దారకొండ ప్రధాన రహదారి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విరివిగా నిధులు మంజూరు చేసి అంతరాష్ట్ర రహదారి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.